కయ్యా-కాలువ

'కరుణకుమార'

(తరువాయి)

౫

కుప్ప లింకా ఇప్పుడప్పుడే నూర్చరు. ఉగాదికిగాని కళ్లాలు చేయడానికి కయ్యలారవు. అందువల్ల కుప్పలన్నీ పొలాల్లోనే ఉన్నవి.

లక్ష్మమ్మ రాత్రిపూటకుప్పలవద్ద మనుష్యుల్ని కాపలాపెట్టుతూనే వుంది. రోజూ రేపటివేళనో, మాపటివేళనో ఏదో ఒక పొయ్యిల్లో ఆమె ఒకసారి కుప్పలచాయ బోయి తనసొమ్ము భద్రంగా ఉన్నదో లేదో అని చూచుకొంటూనే వుంది. తగని అనుమానం మనిషి! ఎవరినీ నమ్మదు. తనమనస్సే తను నమ్మలేదు. పొలంలోసొమ్ము ఇంట్లోకి వచ్చేవరకూ ఆమెకు ఒకటే ఆలాపనగా వుంది.

ఇట్లా వుండగా ఒకరోజు ఉదయాన్నే ఆమె పొలంచాయ బోయి, కొండడికయ్యకు సమీపంలోవున్న తనకుప్పలను తణిఖీచూచుకొంటూ వుండగా, అందులో ఒక కుప్పకు నెత్తిన నడిభాగంలో ఒకమోపు పన పెరికి బయటికి తీసినట్లుగా ఆమెకళ్లకు కనిపించింది. మరి, ఎవరైనా కావాలని రాత్రిపూట చోరీగా వచ్చి ఆకుప్పలో ఒక మోపెడుపన తీసి ఎత్తుకొనేపొయ్యారో, లేక అంతకు ముందటిరోజు సాయంత్రాన్ని కొట్టిన సుడిగాలికి, కుప్ప కప్పడంలో ససిలేక, పైభాగంలో ఒక సందెడుగడ్డి గాలికి ఎగిరేపోయిందో, లేక ఆమెఅనుమానపుకళ్లకే ఆవిధంగా కనుపించిందో మనం చెప్పలేం కాని మొత్తానికి ఎవరో తనను అన్యాయంచెయ్యాలని, రాత్రిపూట చోరీగా తనకుప్పలో పన పెరుక్కొని పోయారని లక్ష్మమ్మకు ఘట్టినమ్మకం తట్టింది. ఇక బ్రహ్మరుద్రాదులు దిగివచ్చినా ఆమె నమ్మకాన్ని తిప్పలేరు.

ఇక నెందుకు, తన రెండులక్షల రూపాయల సంసారమూ నట్టేట కలిసిపోయినట్లు రెండుచేతులతోనూ గుండెలు గుద్దుకొంటూ ఆమె నోటికివచ్చినతిట్లు తిట్టుకొంటూ, వీథిన బడి గొల్లున గోలపెడుతూ పరుగుపరుగున ఇంటికివచ్చీరావడంతోనే తొందరగా రమ్మని రామిరెడ్డికి కబురుచేసింది. ఏదోకొంపమునిగిందనుకొంటూ రామిరెడ్డీ, రామిరెడ్డితల్లీ, రామిరెడ్డిచెల్లెలూ ఇంటిల్లిపాదీ పరుగెత్తుకొనివచ్చేవరకు, లక్ష్మమ్మ తల విరబోసుకొని, దక్షిణపుతట్టువసారాలో వట్టినేలను, ఈమూల నుండి ఆమూలకు దొర్లుతూ, రోజుతూ, రొప్పుతూ "అయ్యో నాకొడుకా! అయ్యో రామిరెడ్డీ! కొంప గుండం వేసుకొని పోయిందిరా, నాయనా! నాసంసారానికి నేటి

కంటికీ నేలకీ ఏకధారగా,
పెద్ద పెట్టున ఏడిచింది.

కిన్నికడగండ్లు వచ్చాయిరా తండ్రీ! అయ్యయ్యో! మేరుపర్వతంలాంటి కుప్ప, అస్తులూ, చర్మమూ, మాంసమూ అరిగిపోయేటట్లు కష్టంచేసి పండించుకొన్నకుప్ప, నా తండ్రీ! నారామన్నా! నా మొలగొలుకుల కుప్ప, బంగారంలాంటికుప్ప - నట్టేట కలిసిపోయిందిరా బాబూ! నేను గొంతుక్కి ఉరోసుకొని చావవలసినరోజు వచ్చిందిరా కొడకా" అని చూడవచ్చినవాళ్లకు తుదామొదలూ ఏమీ అర్థంగాకుండా ఒక్క టేగుక్క పెట్టుతూ, కంటికీ నేలకీ ఏకధారగా, పెద్దపెట్టున ఏడిచింది. రామిరెడ్డి అప్పుడే గ్రహించుకొ

న్నాడు. 'ఇదంతా ఆఘాయిత్యంతప్ప మరొక్కటి కా'దని రామిరెడ్డికి తెలుసును. అయితే మట్టుకు ఆమె నోదార్చకుండా ఊరుకొంటే తాను ఆశపెట్టుకొన్న రెండులక్షల రూపాయల ఆస్తీ తన కామె సెటిల్‌మెంటు వ్రాసి ఇవ్వదేమో నని లోపల భయం అతనికి. అందువల్ల ఆమెదంతా నటన అని తెలిసినప్పటికీ అదంతా నిజమేనని తానుగూడా విశ్వసిస్తున్నట్టు నటించకపోతే చిక్కువచ్చి పడుతు, దనుకొన్నాడు:

"ఏందమ్మా? అసలుసంగతేమిటో చెప్పవమ్మా! ఏంజరిగిం దేమిటి? సిన్న పగటివేళ పొలంచాయపోయి చూచివచ్చాను. మన కుప్పలన్నీ భద్రంగానే ఉన్నవే! ఇప్పు డేం వచ్చిందీ?" అని రామిరెడ్డి అడిగేవరకు,

"దానికి కాలం వచ్చేటప్పటికి ఎంతలో పోవాలెరా నాయనా! నిన్నరాత్రి తెల్లవార్లూఎంతమందిజనం మోసినారోగాని సగం కుప్ప ఎగిరిపోయిందిరా బాబూ! వీళ్లు నాశనంగానూ; వీళ్లకడుపులు మండిపోనూ; వీళ్ల వంశం నిర్వంశంగానూ! నా మెంగిలికూటి కాశపడ్డారురా కొడకా!" అని లక్ష్మమ్మ మళ్లా అందుకొంది.

"అయితే ఎవరెత్తుకొనిపోయినా రంటావు?" అన్నాడు రామిరెడ్డి.

"ఎవరని సన్నడుగుతా వెందుకయ్యా? అయ్యయ్యో! ఈమాలమాదిగ కొడుకు నా ఇంటికి శనిగ్రహం పట్టినట్లు పట్టినాడురా బాబూ! తలకింద కొరివిలా నాకయ్యాకింద వాడు ఊరికేనే చేరినా డనుకొన్నావా! వాడితో నాకు బతికేవిత్తు లేదురా బాబూ! మొన్న నేను వాడికి కాల విర్వలేదని వాడు నన్నప్పుడే బెదిరించి నామీద శాబ్దీలుతీసి వెళ్లాడురాబాబూ! నాకొంప గుండంవేసింది. ఆమాలమాదిగవెధవ కొండడుతప్ప మరొకరి పని గాదురా ఇదీ" అని లక్ష్మమ్మమరీ ఏడిచింది.

"అట్లాగయితే నేను విచారిస్తా గాని, ను వ్వూరికే రచ్చచేయబోకు! మాలవా డెక్కడకు పోతాడు? నిముషాలమీద నీ సొత్తంతా నీయింట్లో చేరుతుంది, ఏడవబోకులే లేచి పళ్లుతోముకొని, ఇన్ని చద్దినీళ్లు తాగు. అయ్యయ్యో! అరచి అరచి గొంతుకు రాచుకుపొయె; ఆయాసమూ, శోషాకూడా వచ్చిందిగదమ్మా తల్లీ! లే! ఎండపడింది. లే!" అని రామిరెడ్డి ధైర్యంచెప్పాడు.

లక్ష్మమ్మకు విడిపోయిన జుట్టు రామిరెడ్డి తల్లి ముడివేసింది. సందిటపట్టి లక్ష్మమ్మను రామిరెడ్డి పైకి లేవదీసి చీడీమీద కూర్చోపెట్టాడు. లక్ష్మమ్మ చెదిరిపోయినపైట సర్దుకొని, జిర్రునచీది ఎడంచేత్తో విసరి నేలనేసి కొట్టింది. వొంటి నంటుకొన్న దుమ్మూ, ధూళీ రామిరెడ్డి తుడిచాడు. రామిరెడ్డి చెల్లెలు పళ్లుతోముకో నీళ్లు పిన్నమ్మపక్కన పెట్టింది. కళ్లు తుడుచుకొని లక్ష్మమ్మ మొగం కడుక్కొంది.

౬

రామిరెడ్డి దూరాలోచనగల మనిషి; కానైతే జబ్బురకంమనిషి కాదు. పినతల్లి చేసిన చేష్టలన్నీ ఆమూలాగ్రంగా తనలో తాను విమర్శించుకొన్నాడు. అతని కసలు పినతల్లి తత్వం మొదటినుంచీ తెలవనే తెలుసు. ఆమెఆఘాయిత్యంలోని అర్థం ఇతరులెవ్వరూ అతనికి చెప్పనవసరమే లేదు. ఈ మొత్తంతా కొండణ్ని తనకయ్యలదగ్గరనుండి లేవగొట్టి వాడికయ్య తాను తీసుకోవడానికై వేసిన మొత్తని రామిరెడ్డి బాగా మనస్సుకు తెచ్చుకొన్నాడు. అసలు కుప్పలో చోరీపోయిన సంగతే అబద్ధమని అతనికి నమ్మకం. అందులో కొండడు అట్లాంటి నీచపుపనికి పోడని కూడా అతనికి బాగా తెలుసు. అయితే మట్టుకు ఏం చేయగలడు? లక్ష్మమ్మకు తాను ఇన్ని యేళ్లుగా చేస్తూవున్న సేవంతా ఒక మొత్తూ, ఇప్పుడీకయ్యతకరారులో చేయవలసిన సేవంతా ఇంకో మొత్తూను. అబద్ధమో, సుబద్ధమో ఏదైనప్పటికీ ఇందులో మాత్రం తాను నడుంకట్టి తగినంతపని చెయ్యకపోతే, ఇక లక్ష్మమ్మ జన్మజన్మాలకూ తన్ను గుమ్మం తొక్కనీయదు సరికదా, ఆఖరుకు తనముఖం కూడా చూడదు. ఇక రెండులక్షల రూపాయల ఆస్తికీ తాను నీళ్లు వదులుకోవలసిందే!

ఇంటికి పోయి పైన గుడ్డ వేసుకొని, చెప్పులు తొడుగుకొని, కర్ర చేతపుచ్చుకొని రామిరెడ్డి తిన్నగా కరణం రామగుండం బసవయ్యగారి యింటికి వెళ్లాడు.

బసవయ్యగారు నిఖారుసైన నియోగి బిడ్డ. తండ్రిపేరూ తాతపేరూ మాత్రమే కాకుండా, అసలు ఆర్వేలవారందరి పేరు ప్రతిష్ఠలూకూడా ఏకటాకీని నిలబెట్టుతున్నాడాయన. అనాదిగా వారిది పెద్దకరణాల కుటుంబం అని పేరుపడింది. దానికితోడు ఆయన స్వతహాగా తెలివితేటలుగల ఘటం. అందువల్ల గ్రామంలో బసవయ్యగారి బావుటా బాగా ఎగురుతోంది. ఆవూరుమునసబు కమ్మనాయుడు. సంతకంమాత్రం ఎట్లాగో నేర్చుకొన్నాడు. బసవయ్య గారు నుంచోమంటే నుంచోవాలె, కూర్చోమంటే కూర్చోవాలె అతను. అందువల్ల ఆగ్రామపుసివిల్, క్రిమినల్, రెవిన్యూవగైరా యావత్తు అధికారాలూ బసవయ్యగారే చలాయిస్తూ రెండుచేతులా గ్రామంలో నొల్లుకొని తింటున్నాడు. కాని ఎంత సంపాదించినా-ఆయనకుటుంబం పెద్దది. అందువల్ల కూతుళ్ల పెళ్లిళ్లకీ, కార్యాలకూ, కొడుకుల పెళ్లిళ్లకూ, వాటికీ వీటికీ చాలక, కొంతవరకు లోకులకు ఋణపడ్డాడు. అచ్ఛం రామిరెడ్డికే ఆయన ఆరువేలు అచ్చవలసుంది. ఆమొగమాటంకొద్దీ తనకు గ్రామంలో ఎంత పలుకుబడి ఉన్నా, అప్పుడప్పుడు బసవయ్యగారు రామిరెడ్డికిమాత్రం రవంత పక్కలు వంచుతూవుండవలసివచ్చింది.

రామిరెడ్డి రావడంతోనే బసవయ్యగారు అతణ్ణి ఆహ్వానించి చావడిలో ఉత్తరపు తట్టు అరుగుమీద చిరిచాపవేసి "ఏం ఇట్లా వచ్చావు, కథ" అని ప్రశ్నించాడు. "ఖీ

తోనే పని ఉండి వచ్చా: నిన్నరాత్రి మా పిన్నమ్మ దక్షిణపునట్టులోని కుప్పలో ఎవరో దొంగతనంగా పదిమోపులు పన కట్టుకొని పోయారట. దానికోసరం ఆమె గోలపెడు తోం" దన్నాడు రామిరెడ్డి.

"పదిమోపులే ?"

"ఆఁ! పదంటే పది కా దనుకో. అంతకు తక్కువే కావచ్చు. ఎంతయినప్పటికీ మొత్తానికి దొంగతనం దొంగతనమే."

"అయ్యో! కాదుమరీ. పాపం ఆమె సొమ్ముకు కక్కుర్తిపడ్డ గాడిదకొడు కెవడయ్యా ?"

"నీతో నిజం చెప్పొద్దూ: ఎత్తుకొని పోతూవుండగా ఎవరూ కళ్లారా చూడలేదు. మాపిన్నమ్మకేమో మాలకొండడిమీద అనుమానం."

"అబ్బే! వా డట్లాంటిపనికి పోయే వాడు కాదయ్యా పాపం. ఎందుకు మనం మాత్రం ఒకరిమీద పాపంమాటలు అనుకోవాలె ?"

"అవునుమరి. వాడిసంగతి నాకూ తెలుసు. అయితే ఆమెమాత్రం వాడే చేశాడు ఈపని అని ఘంటాపథంగా చెప్తాతోంది. ఆమెమతం మార్చడానికి బ్రహ్మదేవుడి తరంగాదు."

"అయితే ఇప్పు డేంచేద్దామని నీఆలోచన ?"

"చేయడాని కేముంది? కొండణ్ణి పిలిపించి ఆమె కుప్పలోపోయిన కట్టలు ఆమెకిప్పించివెయ్యి."

"అంతటితో ఆమె తృప్తిపడుతుందా?"

"అదీ సందేహమేలే. తీరా పదికట్టలు వాడిచేత ఇప్పించినా, చోరీచేసినందుకు వాడికి జుల్మానా విధించి అదికూడా తనకే ఇప్పించవలసిందని ప్రాణాలు తీస్తుంది. ఆమెతో నక్కచావు వచ్చిపడిం దయ్యా నాకు. ప్రాణాలు కొరికేస్తుంది పాడుముండ."

"ఎట్లాగా నీరొట్టెవిరిగి నేతిలో పడిందిలే. అస లామెసంసారాని కెక్కపెట్టి వున్నావు. మొత్తానికి నీది ధనజాతకమే."

"ఏమో; ఆముండ అంతరించే దెప్పటికో, మనపాచిక పారే దెప్పటికో. మరి ముందు దీనివిషయం పరిష్కారంచేయాలె. ఈపని నీచేతిలో వుంది."

"మరీ ఇంత అన్యాయంలోకి దిగుతున్నావేమిటయ్యా, రామిరెడ్డి! పోనీ, ఎత్తుకొనిపోతూవుండగా ప్రత్యక్షంగా చూచినట్టు సాక్ష్యమేనా వుంటే ఏదోవిధంగా యేడవ్వచ్చు. ఎవడో వీధిన పొయ్యేవాణ్ణి పిలిచి, నువ్వు లక్ష్మమ్మకుప్పలో చోరీచేశావని ఎట్లాగ నిరూపించడం? నువ్వే చెప్పు."

"సరేలే! ఈధర్మపన్నా లన్నీ ఏకరువు పెట్టడాని కిప్పు డేమీ సందులేదు. నాకు తెలుసు. అసలు చోరీ జరిగిందో లేదోకూడా

నాకూ అపనమ్మకమే. ఇంటికి వచ్చి మా పిన్నమ్మని చూడకపోతివి. పొద్దుటినుంచీ ఆమె చేసే ఆఘాయిత్యం చూస్తే నువ్వేమనుకొందువో! ఈ విషయంలో మట్టుకు నువ్వు పూర్తిగా నామాట దక్కించాలె. నీకు తప్పదనుకో. నామెడకు గండగత్తెర చుట్టుకొంటే, నీకు చుట్టుకొన్నట్టుకాదూ, బసవయ్యగారూ ?"

"అయితే భోజనంచేసుకొని మధ్యాహ్నం వాణ్ని పిలిపించి విచారించి ఏదో రకంగా తీర్మానం చేద్దాంలే. పెద్దమనిషివి, నువ్వే స్వయంగా ఇంత నొక్కి చెప్పుతుంటే ఇక తప్పుతుందా ? "

" సరే " అంటూ రామిరెడ్డి లేచి ఇంటికి వెళ్లాడు. పదకొండుగంట లయ్యేసరికి బసవయ్యపంతులు గూడా స్నానం చేసి, ఆహ్నికం పూర్తిచేసుకొని భోజనంచేసి, మధ్యాహ్నం మూడుగంటలకు కొండడికోసం ఇంటికి కబురుచేశాడు. బర్రెగొడ్డొకటి మేతానీళ్లూ మేయక, పొద్దుగూకులూ అరుస్తూ పశువులమీదికి ఎగబడుతూ వుంటే, దున్నపోతును దాటించడానికి దాన్ని కొండడు పక్కవూరికి తోలుకుపోయాడని ఇంటికాడ చెప్పేవరకు పోయినమనిషి తిరిగి వచ్చి ఆసంగతులే పంతులుతో చెప్పాడు. తాను చెప్పినపని ఏమి చేశాడో కనుక్కొరమ్మని రామిరెడ్డి అప్పుడే కబురుచేశాడు. ఇక ఆలస్యం చేయడానికి వీలుండేటట్టు లేదని రామిరెడ్డిని పిలిపించుకొని, అతన్నీ, ఇద్దరు వెట్టివాళ్లనూ కూడాతీసుకొని బసవయ్యపంతులు ఏకాఏకీని మాలవాడలో కొండడి ఇంటికి పోయినాడు. విచారిస్తే కొండడు లేడని తెలిసింది.

కొండడిది ఒకదూలం చప్పరం. మామూలు చుట్టుగుడిసెకంటె రవంత పెద్దది. లోపల కొండడి తల్లితప్ప ఇతరు లెవ్వరూ లేరు. కొండడిభార్య కూలికిపోయి ఇంటికి రాలేదింకా. దానిచంటిబిడ్డ-పదినెల్లకూన-గుడిసెలో కింద గోతంపట్టామీద పండుకొని దొర్లుతూవుంది. ఈ పదిరోజులుగా తిరిగితిరిగి ఏరుకొనితెచ్చుకొన్న పరిగలన్నీ కలిసి ఒకటి రెండు చిన్నకట్ట లయ్యేవరకు, కొండడితల్లి ఆరెంటినీ గుడిసెలో ఒకతట్టుగా వేసి, ఆరాత్రి కూటికి గింజలు లేనందున, సందెడుకర్రలు ఆకట్లల్లోవి తీసి గుడిసెవాకిట ఎండబెట్టి, ఎండినకర్రలు కొద్దికొద్దిగా తీసి కింద ఈతాకుచాపమీద వరివెన్నులు కుడికాలికిందవేసుకొని నలుపుతోంది. గింజలన్నీ రాలినతర్వాత గడ్డిని మాత్రం ఒకపక్కగా పెట్టుతోంది.

బసవయ్యపంతులూ, రామిరెడ్డీ, సిబ్బందీ వచ్చేవరకు వెంకికి గాభర పుట్టింది. "ఇదేం దబ్బా! ఎన్నడూరాని అయ్యవారు కూడా మాలవాండ్ల గుడిసెకాడికి ఎండలో పడి వచ్చాడే" అని దానికి ఏమీ అర్థం కాకుండా వుంది.

"వెంకీ! ఆఖరుకు రానురాను నీకొడుక్కి ఇట్లాంటి దొంగబుద్ధులుకూడా పట్టుపడ్డాయిటే?" అన్నాడు బసవయ్య.

"ఏంది మా రాజా! ఏంచేశా డయ్యా నాకొడుకు?"

"ఏంచేశాడా? నిన్న రాత్రి లక్ష్మమ్మ కయ్యకుప్పలో పనవెరికి చోరీగా తెచ్చి ఇంట్లో వేసుకొన్నాడటగా? ఇదిగో! రామి రెడ్డికూడా వచ్చాడు."

"ఏలక్ష్మమ్మ సామీ! — రామరామ! మే మట్లాంటి పాపాలకు పొయ్యేవాండ్లము కాదుసామీ! నాకొడుకు ధర్మరాజు సామీ."

"ఛీ! నోరుముయ్యి, మాలముండా! ఊళ్లోవాళ్లసొమ్ము దోపిడీచేసి ఇంట్లో వేసుకొని కమ్మంగా తిందా మనుకొన్నావా? నీ సంగతి నే నెరగనూ? అసలు నువ్వే చెప్పి పంపించిఉంటావు కొండణ్ణి దోపిడీచేయ మని. జైలుకు పంపిస్తా చూడు."

"ఏందయ్యా సామీ! ఈగొడవ ఈ రోజు? నాకొడుకు నిన్న పగటేళనంగా బర్రెను తోలుకొనిపోయాడు నాయనా! రాత్రి వా డింటికి రాలేదు. ఆపాపం మాకు తెలియదు సామీ! ఉంటే తింటాం, లేకుంటే పస్తుపండుకొంటాంకాని, దొంగకూళ్లు మాకు పనిలే దయ్యా! నీకు దణ్ణంపెట్టి చెప్పతా సామీ!" అని వెంకి అనేవరకు వెట్టివాళ్ల నిద్దరినీ పిలిచి వాళ్లతో "ఒరే లోపలికి పోయి సోదావేసి చూడండిరా; ఇంట్లో పన కట్ట లుంటే బయటవేయండి" అని బస వయ్య చెప్పాడు. వెట్టివా ళ్లిద్దరూ మాల వాళ్లే. బసవయ్య ఈ మాట అనే నరకు, ఇద్దరిలో ఒకడు కాలుముడుచుకోను పోయినట్టుగా పోయి మొఖం తప్పించాడు. రెండోవాడు సందేహిస్తూ సందేహిస్తూ, ముఖం కిందకి వంచుకొని, చేతిలోకర్ర కింద టక్కు_టక్కున కొట్టుతూ, అడుగులో అడుగు వేసుకొంటూ తలబరుక్కొంటూ ముందరికి పోతున్నాడు. అది చూచి బసవయ్యపంతులు:

"ఏందిరా, నీ కేమైనా సొయ్యమా ఏందిరా? గుడిసెలో సోదావేయమంటే పెళ్లినడకలు నడుస్తా వేందిరా? మెడలు విరగదన్నుతా, గాడిదకొడకా! పో! తొంద రగా వెళ్లు" అని వెట్టివాణ్ణి అదిలించాడు.

వెట్టివాడు గుడిసెలో దూరాడు.

"ఇదేంది పంతులూ! ఈఅన్యాయం? పిల్లోడూ, పిల్లాకూడా ఇంటికాడ లేకుండా చూచి నాగుడిసెకు నిప్పు పెట్టుతుండా వేమయ్యా" అని వెంకి గొల్లుమన్నది.

మాలవాడలోని మాలలందరూ కూలి పనులకు పోయినందున, ఎవరో అక్కడక్కడ ముసిలీ ముతకా పిల్లా, జెల్లా తప్ప ఇతరు లెవ్వరూ పెద్దతలకాయలు కనుపడడం లేదు. వెంకిగుడిసెకాడ జరిగేగలభాకు ఆ వున్నవాళ్లే పిల్లా, పీచూ—పదిమందీ పోగయారు. వెట్టివాడితోకూడా వెంకి గుడిసె లోకి దూరింది; వాడి కాళ్లావేళ్లా చుట్టుకొంది. అయిదునిముషాలవరకు లోపలికిపోయిన వెట్టివాడు బయటికి రాలేదు. వెంకి గోల పెట్టుతోంది. దానిఅవస్థ చూచేవరకు వాడికి

కళ్లవెంబడి నీళ్లు గిర్రున తిరిగినవి. సోదా వేయడానికి కళ్లచూపు ఆనలేదు వాడికి: "మమ్మల్నిట్లా ఎందుకు పుట్టించావయ్యా భగవంతుడా" అని వెట్టివాడు తనలో అనుకొని నిట్టూర్పు విడిచాడు.

"ఏమిరా! లోపల దూరి ఎంతసేపటికీ బయటికిరా వెందువల్లరా? ఈరోజు నీకేమైనా ముసించిందా ఏమిటి? లేక ఈ దొంగసొత్తులో నీకేదైనా భాగం ఉందా? బయటికి రావేమి?" అని బసవయ్యపంతులు బయటనుండి అరుస్తున్నాడు. కాని వెట్టివాడు బయటికి రాలేదు. బసవయ్యకు ఒళ్లు భగ్గుమనింది. వెట్టివాడు సమయానికి మొగమాటంవల్లనో, కులాభిమానంవల్లనో జంకుతున్నాడని, తానిక చెయ్యిచేసుకొంటేనే గాని వీల్లేదనుకొని, బసవయ్య దుడుంగున పడిసెలోకి దూరాడు. వెంకి పరిగపరి తెచ్చి పోగుపెట్టిన రెండుకట్టలూ చూశాడు.

"ఈకట్ట లెక్కడివే వెంకీ?" అని అడిగాడు బసవయ్య.

"వరికొయ్యకాల్లో పరిగపరి తెచ్చుకొన్నవి, సామీ! ముసిలిముండని. నడుము పడిపొయ్యేటట్టు ఒక్కొక్కక్కర్రే యేరి తెచ్చుకొన్నా: ఇది దొంగసొత్తు కాదు మా రాజా! నీకు దణ్ణంపెట్టుతా" అన్నది.

"ఛీ! నోరుముయ్యి, పళ్లురాలగొట్టుతా లంజా! తప్పుడుమాటలు కూస్తావు" అంటూ ఆయనే రెండుకట్టల్నీ బరబర బయటికి లాక్కొనివచ్చాడు. వెంకి నోరూ, నెత్తీ లబలబ కొట్టుకొంటూ బసవయ్యకు అడ్డుతగిలేవరకు, మాలముండ తనను తాకుతుందేమో, ప్రాయశ్చిత్తం చేసుకోవాలెనని భయంతో, బసవయ్య తనచేతికర్ర రెండు చేతులతోనూ ఆచివరా, ఈచివరా పట్టుకొని వెంకిమెడమీద బెట్టి ఒక్కనెట్టు నెట్టాడు. "చచ్చాను దేవుడా" అంటూ వెంకి నాలుగు గజాలదూరంలో పడిపోయింది. ఈయుద్ధరంగంలో రామిరెడ్డి ఏమీ జోక్యం కలుగజేసుకోకుండా, చూస్తూ కొయ్యబొమ్మలాగ నిలబడివుండడమే ఆశ్చర్యకరమైన విషయం! ఆశ్చర్యంమాత్రం ఏముంటుందీ? బసవయ్య పాపాలకల్లా భైరవుడు. రామిరెడ్డి అప్పపెట్టి ఆయన్ని కొన్నాడు. ఇప్పుడు ఆయనచేత తన యావత్తు పనులూ, కూలివాడి చేత చేయించుకొన్నట్టు చేయించుకొంటున్నాడు. తనకృతజ్ఞత చూపి ఋణదాతను మెప్పించాలన్నకోరిక తప్ప, బసవయ్యపంతులుకు మరో తలంపులేదిప్పుడు. అందువల్ల ఆఆవేశంలో ఆయన తనస్వంతపనుల్లోకంటె ఎక్కువ సాహసమూ, ఎక్కువ పట్టుదలా, ఉత్సాహమూ చూపుతున్నాడు.

బయటికి లాక్కొనివచ్చిన రెండుకట్టలూ బసవయ్యచేతనే తన ఇంటికి మోయించేవాడు రామిరెడ్డి. కాని ఎందుకు బ్రాహ్మణ్ణి కష్టపెట్టగూడదనుకొని, తన జీతగాళ్లలో ఒకణ్ణి పిలిపించి రెండుకట్టలూ లక్ష్మమ్మయింటికి చేర్పించాడు.

కిందపడిన వెంకి కిందనే పొర్లుతూ వుండగా, తలపెట్టినకార్యం జయప్రదంగా కొనసాగినందుకు తనలో తనే సంతోషపడుతూ, బసవయ్య జారిపోయినజుట్టు తిరిగి ముడివేసుకొని, కర్రచేతబుచ్చుకొని, జయభేరీమోగిస్తూ, చేతులు ఊగీసలాడించుకొంటూ, రామిరెడ్డితోగూడా ఇంటికి పోయినాడు. వెళ్లి బావిదగ్గర ముఖాన్న ఉండిన గంధంపట్టెలూ, అక్షతల బొట్టూ వగైరాలన్నీ పొయ్యేటట్టు పదబిందెలు నెత్తికి తోడిపోసుకొని స్నానం చేసి, చేతికర్రకూడా కడిగేసి, ఇంట్లోకి పోయి పట్టుగుడ్డ కట్టుకొని, విభూతి ధరించి మైలబడ్డ జందెం తీసివేసి, కొత్తజందెం వేసుకొని నూటఎనిమిదిసార్లు గాయత్రి జపించాడు; తరువాత లేచి, చలవమడతలు కట్టుకొని, మంచి తీర్థం తీసుకొని వీథిలోకి పోయాడు. ఇంతలోనే లక్ష్మమ్మ పిలిపించేవరకు ఆమెయింటికి పోయి వీథి అరుగుమీద కూర్చొని రామిరెడ్డి, అతనూ, లక్ష్మమ్మా ఈముచ్చటే ఏమిటో మాట్లాడుకొంటున్నారు. రెండు వరికట్టలూ ఇంటికి చేరినప్పటికీ, పోయినసొత్తు పూర్తిగా రాలేదని లక్ష్మమ్మ సణుగుతూనే వుంది, చెవులో పోటులాగ. "బయటకు పోయిన మొగాడు, కొండడు ఇంటికి వచ్చినతర్వాత కొరవగూడా ఏదోవిధంగా భర్తీపెట్టుతాం లేవమ్మా. నీసొత్తు గడ్డిపరకంతకూడా ఎక్కడికీ పోదు" అని బసవయ్య ధైర్యంచెప్పి లక్ష్మమ్మను ఓదారుస్తూన్నాడు. "ఏమో నాయనా! నాప్రాణం హరీ అనేవరకూ ఏకడగండ్లూ లేకుండా నాతను విట్లా తెల్లవారిపోతే, నా కంతేచాలు. లోకులసొమ్ము నాకు ఆవగింజంతకూడా అక్కర లేదు. ధర్మాత్మురాలు లక్ష్మమ్మ అని లోకం అంతా మోగిపోతున్న రోజుల్లో, ఈనాటి కీమాలముండాకొడుకు నన్ను బయటికి నలుగురిలోకీ ఈడ్చాడు, వీణ్ణి పోలేరమ్మ బుగ్గిచేసుకుపోనూ" అంటూ సింహద్వారానికి పొదుగింట ఆనుకొని నిలబడి కంట తడిపెట్టుకొని పైటకొంగుతో తుడుచుకొంది లక్ష్మమ్మ.

౭

కొండడు పడమట బారెడుపొద్దుందనంగా, అసురుసురై బర్రెను తోలుకొంటూ, పొద్దుటినుండీ కూడులేక ఇంటి కొచ్చేవరకు, ఇల్లంతా బీభత్సంగా వుంది. వెంకి ఇంటిముంగిట దుమ్ములో పొర్లాడుతూ వుంది. కొండడిభార్య ఇంకా ఇంటికి రాలేదు. జరిగిన విషయం అంతా కొండడు తెలుసుకొన్నాడు. వాడిమనస్సు చీకాకయింది. కథ పెరుగుతున్నందుకు వగచాడు: అధైర్యపడ్డాడుకాని యింతలో సంబాళించుకొని వెధవపరిగకర్రలు నాలుగూ తీసుకొనిపోతేపోయారు. ఇంతమాత్రానికే చెడేదిలేదులే అని వాటివిషయమై దిగులుపడలేదుకాని, తాను దొంగతనం చేసినట్టు నలుగురిలోనూ అపకీర్తిపాలుకావలసివచ్చిందే అనిమాత్రం దుఃఖించాడు. ధైర్యం తెచ్చుకొన్నాడుమళ్లా; తల్లికి ధైర్యం చెప్పి, లేవదీసి ఓదార్చాడు. మరికొంత సేపటికి భార్య వచ్చింది: ముగ్గురూ కాస్సేపు

కళ్లనీళ్లుపెట్టుకొన్నారు. "ఇక ఊరుకోండి. ఇంతటితో మనం అదృష్టవంతులమే" అని కొండడు వాళ్లను ఊరడించి, లేచి నీళ్లు పోసుకొందామని, కడవదగ్గరికి పొయ్యేవరకు – కరణమూ, రామిరెడ్డి పిలుచుకొని రమ్మన్నారని కొండడితావుకు ఒకమనిషి వచ్చి పిలిచాడు. నీళ్లుపోసుకొని కొండడు లక్ష్మమ్మ ఇంటికి పోయాడు, మళ్లా ఏం తెచ్చిపెట్ట బోతున్నారో అని భయపడుతూ. బసవయ్యా, రామిరెడ్డి, లక్ష్మమ్మా ముగ్గురూ కలిసి కొండణ్ణి పదిబూతులు తిట్టి, పోలీసుకు రిపోర్టుచేస్తామని బెదిరించి, కొరతపడ్డ వరి కట్టల ఖరీదుకిందా, దొంగతనం చేసినందుకు అపరాధంకిందా వాడికి పదిహేను రూపాయలు జుల్మానా విధించి, ఆ పైకం అప్పుడే రొఖ్కరూపంగా కట్టినాసరే, లేకుంటే లక్ష్మమ్మపేర రూపాయికి నెలకు అణావడ్డి వంతున అప్పుపత్రం వ్రాసియిచ్చినాసరే, ఏదోఒకవిధంగా తీర్మానంచేయాలని కస్తీ చేశారు. వారు చేసినపంచాయితీకి కొండడికి కడుపు దహించుకొనిపోతోంది.

"నన్ను అడ్డంగా పండబెట్టి ముక్కలు ముక్కలుగా నరికినాసరే నేను మాత్రం ఒక్కదమ్మిడీగూడా అచ్చుకోలేను" అని వాడు అనేవరకు

"నీమదం అణుస్తా నుండరా, పొగరుబోతుగాడిదకొడకా! ఊళ్లోవాళ్లసొత్తు దొంగతనంచేసి, తేరగా ఇంట్లోవేసుకొని తినడమనుకొన్నావా" అని బసవయ్య గ్రుడ్లు వురిమి, లక్ష్మమ్మసేద్యగాళ్లలో ఒకగవండ్ల వాణ్ణీ, ఒకగొల్లవాణ్ణీ పిలిచి "ఒరే, మీరు పోయి కొండడి ఇంటికాడ బర్రెగొడ్డును కొట్టకొనిరాండి. వీడేమో ఒళ్లు తెలియకుండా మాట్లాడుతున్నాడు" అని ఉత్తర్వు చేసేవరకు, ఇద్దరు సేద్యగాళ్లూ ఆక్షణంలోనే పోయి బర్రెను, కొండడు లక్ష్మమ్మఇంటి కాడ వుండంగనే తోలుకొనివచ్చి, లక్ష్మమ్మ పశువులదొడ్లో కట్టివేశారు.

"ఏంచేసినా చెల్లుబడి అవుతుందిగదా అని మీరందరూ కలిసి చేస్తున్నారు ఈపనులన్నీ. ఇంతకంటె మీరు నన్ను చెడగొట్టేదేముందీ? అన్ని పాపపుణ్యాలూ ఆభగవంతుడే కనిపెడ్తాడు లెండి" అని లోపల కుతకుతలాడే హృదయాన్ని తననిస్సహాయస్థితివల్ల జనించిన వేదాంతంతో తృప్తిపెట్టుకొంటూ కొండడు ఇంటికి పోయాడు. ఇంటిదగ్గర తల్లీ, భార్యా గోలుగోలు మని ఏడుస్తున్నారు. పొద్దుగుంకి ఇంటికిచేరిన మాల అమ్మలక్కలు కూడా పోగయి దవడలు నొక్కుకొంటూ నిలబడ్డారు. కొండడు తల్లినీ, భార్యనూ కూకలేసి ఏడుపుమానిపించి ఆరాత్రి గంజితాగి పండుకొన్నాడు.

తెల్లవారింది. కొండడు రెండుకట్టల వరి కర్రలూ పోయినందుకు దుఃఖపడలేదు గాని, ఎట్లాలేదన్నా కనీసం ముప్ఫయిరూపాయలు కిమ్మతుచేసే నిక్షేపంవంటి బర్రె పోయినందుకుమాత్రం కొంత విలపించాడు. తెల్లవారి లేచి చూచేవరకు వాకిట బర్రెలేక ఇల్లంతా

బారుమన్నది. ఎట్లాగైనా కొంత ప్రయత్నం చేసి పైవారికి తెలుపుకొని, పోయిన బర్రెను మాత్రం తిరిగి తెచ్చుకొందామని మహాదోల్లాడినాడు. కాని భత్యఖర్చుకైనా చేతిలో దమ్మిడీ లేకపోయె! ఇక వ్యవహారం ఎట్లా జరపగలడు! అదిగాక బసవయ్య రాక్షస ముండాకొడుకు: రామిరెడ్డి, లక్ష్మమ్మా బలవంతులు. తానుపోయి బర్రెను తీసుకుపోయారని ఏపోలీసువారితోనైనా చెప్పుకొంటే, బసవయ్యా, రామిరెడ్డి కలిసి, అసలు తనమీదికి తెచ్చిపెట్టిన దొంగతనం నేరాన్ని ఏతప్పసాక్ష్యమో సృష్టించి, పెంచి పెద్దది చేసి తుదకు తన్ను ఏజైలులోనైనా నెట్టిస్తారేమోనని భయపడ్డాడు కొండడు, ఎప్పుడూ ఇట్లాంటి లట్టాలుపడ్డవాడు కాదు కాబట్టి. వాడికి ముందువ్యవహారం జరపడానికి ధైర్యం చాలలేదు. తాను దొంగతనం చేసినట్టు వచ్చిన అపనిందకే సగం చచ్చి తిరుగుతున్నాడు. "దానితాడు తెగిరి, పోతేపోయింది బర్రె: నే నీతంటాలు పడలే"నని నిశ్చయపరచుకొని ఊరుకొన్నాడు కొండడు.

ఇంతలోనే తనగ్రామజమాబందీ, తాలూకాకచ్చేరికాడ డిప్టీకలెక్టరుగారు - ఇక నాలుగురోజుల్లో - జరుపుతారని తెలిసింది. రైతులు తమతమ కష్టసుఖాలన్నీ డిప్టీకలెక్టరు దొరతో చెప్పుకోవడానికై తలాఒక అర్జీ వ్రాసుకొని జమాబందీరోజున దొరదగ్గరకు పోతున్నారు. కొండడు తనకయ్యకి కాలవకోసరం పెట్టుకొన్న అర్జీలమీద ఇంకా ఉత్తరవు లేమిన్నీ రాలేదు. పోనీ జమాబందీలో దొరగారితో కాలవసంగతి మొరపెట్టుకొని చెప్పుకొందామని, కొండడుకూడా ఒకఅర్జీ వ్రాయించుకొని జమాబందీనాడు తాలూకాకచ్చేరికి పోయినాడు. అర్జీదార్లను పిలిచినవెంటనే తనఅర్జీకూడా ఇచ్చాడు. దొరగారికి దణ్ణంపెట్టి తనకు కాలవ యిప్పించవలసిందని కోరగా, డిప్టీకలెక్టరు పక్క-కూర్చున్న తహశీల్‌దారువైపు చూశాడు. "గ్రామాల్లో పార్టీలు పెంచుకొని, తగవులాడుకొని, ప్రతీవాళ్లూ కాలవలు కావాలని కోరుతున్నారు సార్! ఈ అర్జీదారుకు అరెకరాభూమికంటె జాస్తి లేదు. వీడిమట్టుకు వీడికికూడా ఒకకాలవ కావలెనంటే ఎట్లా వస్తుంది? ఒకరికిగనుక ఇచ్చినామంటే, ఇక ప్రతీరైతూ తనప్రతికయ్యకూ ఒకకాలవ యిప్పించమంటాడు. ఇది సాధ్యం అయ్యే పనిగాదు సార్!" అని తహశీలుదారు జవాబుచెప్పాడు.

"అవునవును మీరు చెప్పింది నిజమే"నంటూ డిప్టీకలెక్టరు కొండడివైపు తిరిగి "నీకు ప్రత్యేకంగా కాలవ యివ్వడానికి వీల్లేదు. నీ అర్జీ తోసివేశాం" అని ఉత్తరువు చేశాడు.

"అయ్యా! నేను బీదవాణ్ణండి, నా కయ్యకు నీళ్లుపారించుకొనే ఆధారంలేదండి" అన్నాడు కొండడు.

"గ్రామంలో వెయ్యీ, రెండువేల ఎకరాలకు నీళ్లుపారుదల అవుతూ వుంటే నీ అరెకరాకయ్యకూ నీళ్లు రావడంలేదంటే ఎవరైనా నమ్ముతారా?" అన్నాడు డిప్టీ కలెక్టరు.

"లేదు సామీ! లక్ష్మమ్మగారూ, కరణం బసవయ్యగారూ కలిసి నన్ను అన్యాయం చేస్తున్నారు సామీ! నామీద చోరీనేరం పెట్టి నాబర్రెగొడ్డును తోలుకొనిపోయారు సామీ! తమరు కటాక్షించకుంటే నాకయ్యను బీడెట్టుకుని పోవలసిందే సామీ!" అని కొండడు గోలచేశాడు.

"ఒరే, ఇది కచ్చేరీగాని, మీమాలవాడ కాదు, తెలుసునా? నీనడవడిక మంచిదయితే గ్రామంలో ఆసాములు నీరురానియ్యకుండా ఎందుకు చేస్తారు? అరెకరాకయ్యగలవాడివి. నువ్వు లక్షాధికార్లతో తగవు పెట్టుకోవచ్చురా?" అన్నాడు డిప్టీకలెక్టరు.

"వీడు గజదొంగ సార్! వీణ్ణి కె. డి. రిజిష్టరులో చేర్చడానికి పోలీసు సబినస్పెక్టరుగారు రాసుకొనిపోయారు సార్!" అని అక్కడనే నిలబడివున్న కరణం బసవయ్యగారు ఆ కొరవ పూరించాడు.

"గొప్పవాళ్లతో ఎన్నడూ తగవు పెట్టుకోకూడదురా: పో! పో! ఆలక్ష్మమ్మ కాళ్లూ, కడుపూపట్టుకొని నలుగురితోపాటు నువ్వుకూడా నీళ్లుపారించుకో. పో, ఆమెతో తగవులు పెట్టుకోకు" అన్నాడు డిప్టీకలెక్టరు దొర.

"అయ్యా! నామీద అబద్ధపుకేసు పెట్టి ఈకరణం బసవయ్యగారు అన్యాయంచేస్తున్నాడండి" అన్నాడు కొండడు.

"పోరా! జమాబందీలో అవన్నీ విచారించడానికి మాకు వీల్లేదు. నీ కేదైనా అన్యాయం జరిగితే సాక్ష్యం తెచ్చుకొని మేజస్ట్రీటులోనో, సివిల్ లోనో దావాపెట్టుకో. మే మేమీ చెయ్యడానికి వీల్లే"దని దొర ఇంకోఅర్జీదారును పిలిచాడు. నెత్తిన గుడ్డవేసుకొని దిగులుతో కొండడు ఇంటికి పోయాడు.

౮

జమాబందీ అయినమర్నాడే తాలూకాలో జరిగినసంగతంతా లక్ష్మమ్మకు తెలిసింది. మాలవాడికి బాగాజరిగిందని చంకలు తట్టుకొంది. వ్యవహారం తమకు అనుకూలమై కొండడికి కాలవ ఇవ్వడానికి వీల్లేదని దొర తీర్మానంచేశాడుకాబట్టి, అనుకొన్నప్రకారం ఫయిసలుచేయించవలసిందని రెవిన్యూ ఇన్స్పెక్టరు లక్ష్మమ్మకాడికి కబురు చేశాడు. ఇప్పుడు చేతిలో దమ్మిడీఅంటే దమ్మిడీ లేదని జవాబు చెప్పతూ, కొండడికి పట్టా కిచ్చినకయ్య పట్టామార్పించి తన పేర పట్టాకు తెప్పించినట్టయితే దానికీ, దీనికీ కూడా కలిపి అనుకొన్నది ఇస్తానుగాని ఇప్పుడేమీ ఇవ్వడానికి వీలులేదని జవానుతో చెప్పి పంపింది లక్ష్మమ్మ. ఇన్. స్పెక్టరు నిట్టూర్పుపుచ్చి తలవంచుకొని ఊరుకొన్నా

డు. ఇంతలోనే కొండడు వచ్చి ఇన్‌స్పెక్టరుకు దణ్ణంపెట్టి —

"సామీ! నాకు కాలువ తెప్పిస్తానంటిరి. ఆఖరుకు డిప్టీకలెక్టరుదొర ఒప్పుకోకపోయె: నాఅయిదురూపాయలూ నాకు పారెయ్యండి" అని అడిగాడు.

"ఇదేమీ వంకాయలబేరం కాదు: కొరవ అయిదురూపాయలూ నీవు అప్పుడే ఇచ్చిఉంటే, నీ కీపాటికి కాలవ వచ్చేఉండును. స్వల్పంలో అజ్జాయించినందుకు వ్యవహారం ఇట్లా అయింది. చేతికివచ్చిన పైకాన్ని వాపసుయిచ్చే ఆచారం మనదగ్గరలేదు. పో" అన్నాడు ఇన్‌స్పెక్టరుపంతులు. ఉసూరుమంటూ కొండడు వెళ్లిపోయాడు.

కొండడికి చెడ్డరోజులు వచ్చినవి. బంగారు పట్టితే మట్టయిపోతోంది. లక్ష్మమ్మకు తనమీద ఇంతపగ ఎందుకో వాడికి అర్థం కాలేదు. ఆమెసొత్తు తనేమీ ఆశించలేదు. ఆమెకుతోడు ఇప్పుడు బసవయ్యగారుకూడా వాడికి పగవాడయినాడు. కాలంకర్మంకూడా ఒనగూడినట్లయింది వాడికి: ఎవరితోపోయి చెప్పుకోవడానికీ వాడికి దిక్కు తోచలేదు. కయ్యకోసం తెచ్చిన అప్పు పెరిగిపోతోంది. లక్ష్మమ్మతో వ్యవహారం ముదిరిపోయింది. బసవయ్యపగ తాచుపగే; ఎప్పు డేంజేస్తాడో అని దిగులు. వెనుకటి గుండెనిబ్బరం చెడింది. ధైర్యం పలచబడుతోంది కొండడికి.

ఇంట్లో కూటికి గింజలులేక, ఆ మరునాడు చీకటితోనే తనకుప్ప తొక్కించాలని ఆరోజు తనూ తనభార్యా ఇద్దరూ పొలంపోయి కళ్లం బాగుచేసివచ్చారు. మాలవాడలోనే పదిపశువుల్ని వాళ్లనీ వీళ్లనీ అడిగి సంపాదించుకొన్నాడు. తెల్లవారు జామున పోయి కుప్ప పడగొట్టా లనుకొని, సర్వమూ సిద్ధంచేసుకొన్నాడు. ఇంకా ఇద్దరు కూలివాళ్లనుమాట్లాడుకొన్నాడు. రాత్రి భోజనం చేసుకొని నెలపొడవంగనే లేచిపోదా మనుకొని పెందలకడనే నడుంవాల్చాడు కొండడు

జమాబందీలో కొండడు డిప్టీకలెక్టరు దొరతో చెప్పిన నేరాలకు బసవయ్య ఉగ్రుడై కొండణ్ణి నమిలి మింగివేయాలని ఉన్నాడు. లక్ష్మమ్మ కోపమూ, బసవయ్య కోపమూ అంతా ఇప్పుడు బసవయ్యలోనే మూర్తీభవించిపోయింది. "మాలవెధవ, దమ్మిడీకి కొరగానిపక్షి, పబ్లీకులోకి వచ్చి, బ్రాహ్మణ్ణి నామీద దొరదగ్గిర తంటాలు చెప్తాడా? హుం! నేను నియోగిబిడ్డను. వీడికి నామజా ఇంకా తెలియదు కాబోలు: అయిందేదో అవనే అయింది. ఇంతవరకూ వచ్చింతర్వాత వెనక్కి తిరిగితే, పంతులు ఆఖరికి మాలాడి చేతిలో చిక్కుకొన్నా డంటారు నలుగురూను. కాబట్టి ఇక గ్రామంలో వాడైనా కాపురం ఉండాలె! నేనైనా కాపురం ఉండాలె! అంతేగాని వాడూ నేనూ ఈగడ్డమీద కాపురం చేస్తామంటే వట్టికల్ల! తన అంతరమేమి! నాఅంతరమేమి? చెప్పులుమోసే

వెధవ! నాతో సమానంగా దొరదగ్గర నిలబడి మాట్లాడడమే కాకుండా, పైగా నామీద నేరాలు చెప్పి, తాచుపాముతో చెలగాటా లాడుతాడా? వీడిఅంతు పట్టిచూస్తా" అని బసవయ్యపంతులు పరవళ్లు తొక్కుతున్నాడు. కొండడ్ని పిలిపించి సమక్షంలో వాణ్ని నాలుగు బూతులూ తిట్టి పంపడం అంటే ఆయనకు తృప్తి కాలేదు. శాశ్వతంగా నిలిచేటట్టు వాడికి తగినశిక్ష చేయాలనుకొని తీర్మానం చేసుకొన్నాడాయన. తాను వేసుకొన్న ప్లానుకు ఇక కొండడితో మాట్లాడకపోవడమే మంచి దనుకొన్నాడు. తనహృదయ గోళంలో ప్రజ్వలించే క్రోధాగ్ని ప్రత్యక్షంగా బయటపడి శత్రునాశనం చేయవలసిందేగాని అంతవరకూ దాన్ని బయటపెట్ట కూడ దనుకొన్నాడు. తనలోపల తాను కుమిలి కుతకుత ఉడికిపోతున్నాడు బసవయ్యపంతులు.

ఆరోజు సాయంత్రమయింది. బీదలను హింసించే దుర్మార్గుల చర్యలను చూడలేకేమో సహస్రకరుడు ప్రాపంచికదృక్పథాన్నుండి చాటుకు పోయాడు. ఆ అసురసంజ వేళ బసవయ్య రామిరెడ్డిని పిలుచుకొని లక్ష్మమ్మఇంటికి పోయాడు. బసవయ్యకూ, లోకానికీ కూడా అంధకారం అలుముకొంది.

"పంతులూ! ఆకయ్య మనకు దఖలు పడేటట్టు చేస్తూ. నీధర్మాన్న కాలవ పోనే పోయింది! మాలవాణ్ని మటుమాయంచేసి, కయ్యలోకయ్య కలుపుకొనేదాకా నాకు నిద్రపట్టదు, పంతులూ! - ఇదిగో! ఈపని కూడా నీచేతిలోనే ఉంది" అని లక్ష్మమ్మ అనేవరకు — "తొందరపడకు. వాడికి అంత్యకాలం సమీపించిందిలే; ఇప్పుడు నేను వచ్చింది అసలు ఆపనికోరకే" అంటూ పంతులూ, రామిరెడ్డి, లక్ష్మమ్మా మిద్దె మీదికి పోయి, ఒకఅరగంటసేపు ఏమేమిటో గుసగుసలాడుకొన్నారు. సరే నంటే సరే ననుకొని అందరూ మిద్దెదిగి కిందికి వచ్చారు. ఎవరిదారిన వారు వెళ్లారు. బసవయ్య ఇంటికి పోయి, ఉడుకునీళ్లు పోసుకుని సాయంసంధ్య వార్చుకొని భోజనం చేసి పండుకొన్నాడు.

కొండడి యింట్లో కొండడు నిద్రపోతున్నాడు. బసవయ్య యింట్లో బసవయ్య నిద్రపోతున్నాడు. జగత్తంతా నిద్రపోతున్నది ఒక్కలక్ష్మమ్మతప్ప. లక్ష్మమ్మ కాదినం ఏకాదశీపర్వం. నిద్రపోలేదు. జాగారం చేస్తోంది. తనతోపాటు రామిరెడ్డినికూడా మేలుకో బెట్టి అతనివల్ల భాగవతం చదివించి వింటోంది. రామిరెడ్డికీ ఆత్రంగానే వుంది — పడుకొంటే బాగుండుననేమో.

నెలపొడిచి కొండణ్ణీ, వాడిభార్యనూ నిద్రలేపింది. కూలివాళ్లను కేకవేసి చద్దన్నం మూటకట్టుకొని, పశువులను తోలుకొని కొండడూ, వాడిభార్యా ఇద్దరూ వెంటనే కుప్పకాడికి బయలుదేరారు. ఒక పావుగంటసేపటికి వాళ్లు కుప్పకి కనుచూపుమేర దూరంలోకి వచ్చారు. చూస్తాడుకదా తేరిపారి కొండడు, పొగా మంటా కనపడింది

వాడికి తన కుప్ప వున్న స్థలంలో. ఇదేమా అని వాడికి గుండె బేజారయింది. నవనాళ్లూ కుంగిపోయాయి. వొళ్లు తెలియలేదిక. గుండెలు కవుక్కొంటూ వొక్కవుపేరెం తీశాడు కొండడు కుప్పకాడికి.

వచ్చాడు, కొండడు మండుతూన్న కుప్పకెదురుగ్గా నిలబడ్డాడు. అప్పటికే కుప్ప నలువైపులా అగ్నిహోత్రుడిసందెట్లో చిక్కుకుంది. చిటపటమంటూ మంట బ్రహ్మాండంగా మండిపోతోంది. తూర్పుగాలి అందుకొని అగ్నిహోత్రుడికి తోడయింది. ఎవరితరం ఆర్పడమిక? ఆకాశానికంటా యెగసిపోయే ఆమంటలకు వాడి వొళ్లుకూడా మంటలెక్కిపోతూంది. మొగాన నెత్తురుచుక్కలేదు. చూశాడు చూశాడు కుప్పకేసి; నివ్వెరపోయి వెర్రిచూపులు చూశాడు. చైతన్యం స్తంభించిపోయింది. మండుతున్న కుప్పకేసి కొయ్యబరిపోయి చూస్తూ కుప్పగూలిపోయాడు కొండడు.